# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## అడవిలో దుప్పి మృతి..
# మాంసం వండుకున్నారు !!
### అటవీ సిబ్బందికి తెలిసినా వదిలేశారట..?

కుప్పంరూరల్, మార్చి 23 ప్రభాతవార్త

మండలంలోని నాయనూరు అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి ఓ దుప్పి మృతి చెందిందని సమాచారం. దీన్ని గుర్తించిన కొంతమంది గ్రామస్తులు దుప్పి మాంసాన్ని ఇంటికి తెచ్చి వండుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. సమాచారం తెలుసుకున్న అటవీ సిబ్బంది గ్రామానికి చేరుకుని మాంసం వండుకున్నవారితో చర్చలు జరిపారని స్థానికంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధి ఉదయం మాట్లాడు కుందామని అటవీ సిబ్బందిని పంపేసినట్లు పలువురు గ్రామస్తులు గుసగుసలాడుతున్నారు. ఈ విషయంగా అటవీ ఉన్నతాధికారులను 'ప్రభాతవార్త' వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు. కాగా అటవీ సిబ్బంది ఈ వ్యవహారంలో చేతులు తడుపుకుని వదిలేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంగా ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

## కలిసి పనిచేయండి...
# గెలిచిరండి...!
### తెలుగుదేశం అభ్యర్థులతో అధినేత చంద్రబాబు



విజయవాడలో జరిగిన ప్రజాగళం శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి చిత్తూరు జిల్లా అభ్యర్థులు

తిరుపతి, మార్చి 23ప్రభాతవార్త:

సార్వత్రిక ఎన్నికలకు సమయం తక్కువగా ఉందని....ఎమ్మెల్యే,ఎంపి అభ్యర్థులుగా టిక్కెట్లు పొంది, పోటీచేసే వాళ్ళందరూ కూటమి పార్టీలతో కలసి పనిచేసి, గెలుపే లక్ష్యంగా నడవాలని టిడిపి అధినేత నారాచంద్రబాబునాయుడు నిర్ధేశం చేశారు. ఎవరు కూడా నిర్లక్ష్యంగా ఉం డోద్దని....వైసిపి నేతలు అక్రమాలు, ఆగడాలపై ప్రజలతో కలసి అడ్డుకోవాలన్నారు. ప్రజల ఆశీర్వాదం మీకే ఉండాలని ఆకాంక్షించారు. వచ్చే ఎన్నికల్లో ఎంపి,ఎమ్మెల్యే టిక్కెట్లు ఖరారైన అభ్యర్థులతో, పార్టీసీనియర్‌నేతలతో శనివారం విజయవాడలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రజాగళంశిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి చిత్తూరుజిల్లా నుండి తిరుపతి ఇన్‌ఛార్జి సుగుణమ్మ . పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, చంద్రగిరి అసెంబ్లీ అభ్యర్థి పులివర్తినాని, పూతలపట్టు అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్, పలమనేరు అభ్యర్థి అమరనాథరెడ్డి, సత్యవేడు అభ్యర్థి కోనేటి ఆదిమూలం,నగరి అభ్యర్థిగాలి భానుప్రకాశ్, వెంకటగిరి అభ్యర్థిలక్ష్మీ, సూళ్ళూరుపేట అభ్యర్థి నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతినియోజకవర్గంలో టిడిపికి బలమైన ఓటు బ్యాంకు ఉందని, అయితే పొత్తులో భాగంగా తిరుపతి జనసేన పార్టీకి ఇవ్వాల్సి వచ్చిందన్నారు. సుగుణమ్మకష్టపడి పార్టీకోసంపనిచేశారన్నారు. ఆమె కష్టాన్ని వృధా పోనీయనని, తగిన సమయంలో సముచిత అవకాశం ఇస్తామన్నారు. మూడు పార్టీలు కలసి అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేయాలన్నారు. వైసిపి నేతల అక్రమాలు, అవినీతి ఎక్కడికక్కడ అడ్డుకోవాలని, ప్రజలకు జగన్ మోసాలపై వివరించాలని బాబు సూచించారు.ఇంకా నామినేషన్ల సమర్పణ, పరిశీలన, పోలింగ్ జరిగే రోజుల్లో అభ్యర్థులతో బాటుపోలింగ్ ఏజెంట్లు,పార్టీ నేతలు వ్యవహరించాల్సి న విధానాన్ని వివరించారు.ఎన్నికల్లోగెలిచిప్రజాసేవకులంకితంకావాలనిబాబు సూచించారు. రెచ్చగొట్టే ప్రకటనలకు దూరంగా ఉండాలని, నెలరోజుల్లో మీ ప్రాంతంలో ప్రతి గడప మూడుసార్లు గడప తొక్కాలని, నియోజకవర్గంలో అందరూ మూడు పార్టీలు కలసి ప్రణాళికతో పనిచేయాలన్నారు. కార్యకర్తలనుకలిసి పార్టీ విజయంలో భాగస్వాములుచేయాలన్నారు.



చిత్తూర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట మృతుడి కుంటుంబ సభ్యుల ధర్నా.

# ఎలా జరిగింది..!

### హత్యా...లేక అతిగా మద్యం తాగి మృతిచెందాడా ..?
### - మద్యం అధికంగా సేవించి మృతి చెందాడా!
### - లారీ డ్రైవర్ అనుమానస్పద మృతిపై పోలీస్ స్టేషన్ ఎదుట బంధువుల ధర్నా

చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:

చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్(48) శనివారం అనుమానస్పదంగా మృతి చెందాడు. లారీ యాజమాని నాగరాజు, సుధాకర్ స్నేహితుడైన మరో లారీ డ్రైవర్ రఘులు సుధాకర్‌ను హత్య చేసి ఇంటికి మృతదేహంను డోర్ డెవలరీ చేశారని బంధువులు ఆరోపిస్తుండగా బెంగళూరు నుండి లారీ డ్రైవ్ చేసుకొంటూ శుక్రవారం వచ్చిన డ్రైవర్ సుధాకర్ లారీలోనే మద్యం సేవించి పడుకొన్నాడని ఇది గమనించి తాను డ్రైవర్ రఘుతో చెప్పి సుధాకర్‌ను ఆటోలో తీసుకెళ్ళి ఇంటి దగ్గర వదలి రమ్మని చెప్పడం జరిగిందని లారీ ఓనర్‌నాగరాజు పేర్కొంటున్నాడు. ఇందుకు సంబంధించి వివ రాలిలా వున్నాయి. గంగాధరనెల్లూరు మండలం పాచిగుంట దళితవాడకు చెందిన సుధాకర్ చిత్తూరు కొంగారెడ్డిపల్లికి చెందిన లారీ ఓనర్ నాగరాజు వద్ద డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సుధాకర్ లారీ తీసుకొని బెంగళూరు వెళ్ళి శుక్రవారం ఉదయం తిరిగి వచ్చాడు. సుధాకర్‌కు మద్యం సేవించే అలవాటు వుండటంతో ఎప్పుడైనా లారీ డ్యూటీకి వెళ్ళి వచ్చినపుడు లారీలోనే మద్యం సేవించి పడుకొనేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం వచ్చిన సుధాకర్ మద్యం సేవించి లారీలో పడుకొన్నట్లు భావించిన నాగరాజు మరో డ్రైవర్ రఘును పిలిచి సుధాకర్‌ను లేపి ఆటోలో ఇంటి వద్ద దింపిరావాల్సిందిగా చెప్పడంతో ఓ ఆటోలో సుధాకర్‌ను రఘు పాచిగుంటలోని సుధాకర్ ఇంటికి తీసుకెళ్ళాడు. లారీలోనే సుధాకర్ మృతి చెంది వుండటంతో మద్యం మత్తులో వున్నాడని భావించి సుధాకర్‌ను ఆటోలో ఈడ్చి కూర్చొబెట్టడంతో సుధాకర్ మృతదేహం వీపు భాగం ఉబ్బి ఉన్నట్లు కన్పిస్తోంది. ఈ మేరకు సుధాకర్‌ను ఆటోలో ఇంటి వద్దకు తీసు కెళ్ళిన రఘు ఇంటి ఆవరణలో అప్పటికే మృతి చెందివున్న సుధాకర్‌ను వదలి ఎవరికి చెప్పకుండా వచ్చేశాడు. ఇంటి ఎదుట సుధాకర్ పడివుండటం గమనించిన ఇంటి సభ్యులు ఇచ్చి సుధాకర్‌ను పరిశీలించగాఅప్పటికే మృతి చెందివున్న సుధా కర్ మృతదేహంను హుటాహుటిన సమీపంలోని తుంగూండ్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు.అక్కడి వైద్యాధికారులు సుధాకర్ మృతి చెందాడని చెప్పడంతో అక్కడి నుండి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని గాంధీ విగ్రహం ఎదుట ధర్నాకు ఉపక్రమించారు. సుధాకర్‌ను హత్య చేసి డోర్ డెవలరీ చేసిన హంతకులను సత్వరం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.దీనిపైవన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి నేతృత్వంలో ఎస్ఐ షేక్షావలీ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు చిత్తూరు ప్రభుత్వ వైద్యశాఖ వైద్యాధికారులు ఇచ్చే పోస్టుమార్టం నివేదిక ఈ కేసులో కీలకం కానుంది. అప్పటి వరకు మృతి చెందిన లారీ డ్రైవర్ సుధాకర్‌ను ఎవరైనా హత్య చేశారా! లేక మద్యం అధికంగా సేవించి ఇతర ఆరోగ్య కారణాలతో మృతి చెందాడా! అనేది తేలనుంది. ఈ విషయమై డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అతిగా మద్యం సేవించడంతోనే మరణించినట్లు తెలిపారు. శరీరంపై ఎటువంటి గాయాలు లేవన్నారు.

# రాష్ట్రంలో అభివృద్ధి పడకేసింది
### నారా భువనేశ్వరి



మృతుడు పిడుగు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న నారా భువనేశ్వరి, సమావేశంలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

వాకాడు, మార్చి 23, ప్రభాతవార్త

రాష్ట్రంలో అభివృద్ధి పడకేసిందని, తిరిగి రాష్ట్రం గాడిలో పడాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని తెలుగుదేశం అధినేత నారాచంద్రబాబు నాయుడు సతీమణి నారాభువనేశ్వరి అన్నారు. తిరుపతి జిల్లా వాకాడు మండలం తిరు మూరులో శనివారం ఆమె పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో కలత చెంది మృతి చెందిన వెంకటస్వామి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. మృతుడు పిడుగువెంకటస్వామి చిత్రపటానికిపూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సమస్యలు తీరుస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఆమెవెంట కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మీ, గూడూరు వైకాపా అభ్యర్థి పాశం సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే నెలవలసుబ్రమణ్యం, మండల టిడిపి కన్వీనర్ మధురెడ్డి, నాయకలు కృష్ణమూర్తి, మాజీ జడ్పిటిసి ప్రమీల, మాజీ సర్పంచ్ ఉచ్చూరు ప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపిటిసి సురేష్, కుంచం దయాకర్, మోహన్ నాయుడు, అన్నమేటి చంద్రయ్య, రాజ గోపాల్ రెడ్డి, నెల్లూరు సుధాకర్ రెడ్డి, తీగల సురేష్, శంషుద్దీన్ భాష, కోట,చిట్టమూరు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**టిడిపి విజయం చారిత్రక అవసరం**

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సి న బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని నారా భువనేశ్వరి అన్నారు. తిరుమూరులో ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీ టిడిపి నాయకులను, కార్యకర్తలను, ప్రజలను బెదిరించిన భయపడకుండా ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి తిరిగి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాల్సి న బాధ్యత మనందరి పై ఉందని ఆమె చెప్పారు. సైకో పరిపాలనరాష్ట్రం నాశనం అయిందని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు.

## అంతరిక్ష కేంద్రం
# ఫేజ్-1 కాలనీలో చోరీ
### - సిఐఎస్ఎఫ్, పోలీసు దళాల దర్యాప్తు



శ్రీహరికోట (తడ), మార్చి 23 ప్రభాతవార్త

శ్రీహరికోటలోని సతీష్‌థవన్ అంతరిక్ష కేంద్రంలో సిఐఎస్ఎఫ్ దళాలు నివాసం ఉంటున్న కాలనీలోనే దొంగతనం జరిగింది. షార్‌లోని ఫేజ్-1 కాలనీలో ఇంటి వెనుక తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. ఫేజ్-1 కాలనీలో ఒకవైపు కేంద్ర పారిశ్రామిక భద్రత దళాల కుటుంబాలు నివసిస్తుంటాయి. మరో వైపు ఫైర్ సిబ్బంది కూడా ఉంటారు. అక్కడే షార్‌లోని ఆసుపత్రిలో పనిచేస్తున్న హెడ్ నర్సు ఎం.నిర్మల కుటుంబం నివసిస్తోంది. వీరి కుటుంబం గత రెండురోజులుగా వేరే ప్రాంతానికి వెళ్లడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఈ ఇంటిని టార్గెట్ చేశారు. శనివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి వెనుక నుంచి లోపలికి వచ్చిన వారు 24 సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. మొదట కొంతనగదు కూడా అపహరణకు గురైనట్లు తెలిసినా.. ఆ తర్వాత కేవలం 24 సవర్ల బంగారు నగలు దొంగతనం జరిగినట్లు బాధితురాలు ఎం.నిర్మల ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న సిఐఎస్ఎఫ్ భద్రత దళాలు అక్కడ పరిశీలించారు. అనంతరం నాయుడుపేట డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సూళ్లూరుపేట సిఐ మధుబాబు, శ్రీహరికోట ఎస్ఐ ఎం.రఘునాథ్‌లు సంఘటన స్థలానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి దర్యాప్తు వేగవంతం చేశారు. శ్రీహరికోట వంటి అత్యంత భద్రత వలయం ఉన్న ప్రాంతంలో చోరీ జరగడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. శ్రీహరికోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 'సిద్ధం' సభలను విజయవంతం చేద్దాం
### ఏప్రిల్ 3, 4 తేదీలలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సభలు : రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతిరూరల్, మార్చి 23 ప్రభాతవార్త:

తిరుపతిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో "మేమంతా సిద్ధం" సమన్వయ సమావేశం ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలకు దిశా నిర్దేశం చేసారు. ఈ సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 27 నుండి 'మేమంతా సిద్ధం' సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 3,4 తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' సభ ఉంటుందని తెలిపారు. చిత్తూరు లేదా పూతలపట్టులో ఒక సభ, నాయుడుపేట లేదా శ్రీకాళహస్తిలో మరో సభ ఉంటుందని తెలిపారు. ఈనెల 27న ప్రొద్దుటూరు, 28న నంద్యాల, 29న ఎమ్మిగనూరులో సభలు జరగనున్నాయని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 4చోట్ల భారీగా సిద్ధం సభలు నిర్వహించి, చరిత్రలో నిలిచేలా నిర్వహించినట్లు తెలిపారు. సిద్ధం సభలు నిర్వహించిన 4 పార్లమెంట్ స్థానాలలో కాకుండా మిగతా 21 పార్లమెంట్ స్థానాలలో మేమంతా సిద్ధం సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 4పార్లమెంట్ నియోజకవర్గాలలో జరిగిన సిద్ధం సభలతో పార్టీ కార్యకర్తలు ఫుల్‌జోష్‌లో ఉన్నారని తెలిపారు. వైకాపా కేడర్ మేమంతా సిద్ధం సభల విజయవంతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం సిద్ధం పోస్టర్స్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎంపిలు రెడ్డెప్ప, డాక్టర్ గురుమూర్తి,ఎమ్మెల్యే బియ్యపు మధుసూధనరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే అభ్యర్థులు నేదురమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, నూకతోటి రాజేష్, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిద్ధం సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి, రోజా, ఎంపిలు గురుమూర్తి, రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థులు

**జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రి చేయడానికి ప్రజలు సిద్ధం: మంత్రి రోజా**

వైయస్.జగన్మోహన్‌రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా తెలిపారు. ఇచ్చినమాటకు కట్టుబడి ప్రతి హామీని అమలు చేస్తూ, తండ్రికి తగ్గ తనయుడుగా సుపరిపాలన చేస్తున్నారని తెలిపారు. ప్రజల్లో సినిమా హీరోకు లేని క్రేజ్ సి.యం.జగన్మోహన్‌రెడ్డికి ఉందన్నారు. 2014లో చంద్రబాబు అండ్ కో ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టారని ఆవేదన వ్యక్తం చేసారు. 2024లో ప్రజలను మోసంచేయడానికి మళ్ళీ వస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు మెచ్చే, నచ్చే ఎన్నికల మానిపెస్టోతో జగనన్న రాబోతున్నారని తెలిపారు.

## మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు
### - నెల రోజుల నీటి నిల్వలపై వారం రోజుల్లో నివేదికలు
### - కలెక్టర్ సగిలి షన్మోహన్



చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:

జిల్లాలో రానున్న నెల రోజుల పాటు ఎలాంటి మంచినీటి సమస్య తలెత్తకుండా పక్కా చర్యలు చేపట్టాలని, ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తే పరిస్థితి వుంటే సత్వరం పరిశీలించి అంచనా ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి శనివారం కలెక్టర్ సగిలి షన్మోహన్ ఎంపిడిఓలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు, ఇతర నీటి సరఫరా వ్యవస్థకు సంబంధించినఅధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవికాలంను దృష్టిలో వుంచుకొని మంచినీటి ఎద్దడి నివారణకుఅవసరమైన అన్నిముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు వుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే వారం రోజుల్లోపు జిల్లాలో వున్న నీటి నిల్వల గురించి చెరువులు, గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థకు సంబంధించి వనరుల్లో వున్న పరిస్థితి, నెల రోజుల్లో చేపట్టాల్సి న చర్యల గురించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి మంచినీటి వనరును తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ నివేదికలు ప్రభుత్వానికి పంపి చేపట్టాల్సి న చర్యలను తెలుసుకొని చేపట్టవచ్చునన్నారు. అలాగే గ్రామీణ, పట్టణనీటిసరఫరావనరులుఏదైనామరమ్మతులు చేయాల్సి వుంటే వాటికి సంబం ధించినఅంచనాలనుసత్వరంరూపొందించాలనిఅధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పట్టణ ప్రాంతాల్లో నీటి లభ్యత గురించి మున్సిపల్ కమీషనర్లను అడిగి తెలుసుకొన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో నీటి లభ్యత పరిస్థితులను జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, జడ్పీ సిఇఓ గోరియాలను అడిగి తెలుసుకొన్నారు.ఎక్కడైనా నీటిసరఫరాకు సంబంధించి కాకుండా ఇతర అవస రాలకు నీరు సరఫరా చేస్తుంటే దానిని నిలుపుదల చేసి మంచినీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

## కుప్పంలో చంద్రబాబు పర్యటన వివరాలు



కుప్పం, మార్చి 23 ప్రభాతవార్త

తెదేపా అధినేత, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఈనెల 25,26 తేదీల్లో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్న విషయం విదితమే. కుప్పంలో చంద్రబాబు పర్యటన వివరాలు ఇలా ఉనా న్నయి. ఈనెల 25నఉదయం 9గంటలకు హైదరాబాదు నుంచి బెంగళూరుకు విమానంలో బయలుదేరుతారు. 10.40గంటలకు బెంగళూరు హెచ్‌ఎల్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడ నుంచిహెలికాప్టర్‌లో కుప్పం పిఇఎస్ హెలిప్యాడ్‌కు 11.15గంటలకు చేరుకుంటారు. 11.40గంటలకు కుప్పం కొత్తపేట చేరుకుని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శిస్తారు. మధ్యాహ్నం 12గంటలనుంచి కుప్పం టిడిపికార్యాలయం వద్దపార్టీ శ్రేణులతో సమావేశమవుతారు. 3.30 గంటలనుంచి 5.30గంటల దాకా కుప్పంబస్టాండులో జరిగే ప్రజాగళం బహి రంగసభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 6గంటలకు లక్ష్మీపురం కెవిఆర్ కళ్యాణ మండపం చేరుకుని అక్కడ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇస్తారు. రాత్రి 7.30-8.30గంటల వరకు కుప్పం పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమవుతారు. అనంతరం కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహం చేరుకుంటారు. 26వతేదిఉదయం11గంటలకు లక్ష్మీపురం కెవిఆర్ కళ్యాణ మండపంకు చేరు కుంటారు. అక్కడ పార్టీలో చేరేవారిని పార్టీలోకి ఆహ్వానిస్తారు. మధ్యాహ్నం 1గంటలనుంచి బాబునగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్ర మంలో భాగంగా ఇంటింటి ప్రచారం చేపడతారు. 1.40గంటలకు కుప్పం టిడిపి కార్యాలయం చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30-3.30గంటల దాకా పార్టీ శ్రేణులతోసమావేశమవుతారు.సాయంత్రం4.30గంటలకు రామకుప్పం మండలం రాజుపేటకు చేరుకునిఅక్కడ హంద్రీ-నీవా కాలువలను పరిశీలిస్తారు. అక్కడ నుంచి మరలా కుప్పం టిడిపి కార్యాలయం చేరుకుని పార్టీ శ్రేణులతో సమావేశమ వుతారు.రాత్రిమరలా కుప్పంఆర్‌అండ్‌బి అతిథిగృహం చేరుకుని బసచేస్తారు. 27నపలమనేరు, పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లో

# సర్దుకుంటున్న ఉమ్మడి పార్టీ నాయకులు
### అధిష్టానం చర్చలతో ఆశావహులు మౌనం



శ్రీకాళహస్తి,మార్చి 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి తెలుగుదేశంలో సర్దుబాట్లు ప్రారంభమయ్యాయి.ఉమ్మడి అభ్యర్థిగా తెలుగుదేశం నాయకుడు నారాచంద్రబాబునాయుడు బొజ్జల సుధీర్‌రెడ్డిని ప్రకటించారు. అయితే ఆ పార్టీలో టిక్కెట్టు ఆశించిన సీనియర్ నాయకుడు మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు మా మాటేమిటి? నన్ను నమ్ముకున్న వారి మాటేమిటని తిరుగుబాటు బావుటా ఎగురవేసారు. అయితే శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే సీనియర్ నేతగా ఉన్న ఎస్‌సివి నాయుడు నిర్ణయాలు పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే పార్టీ ప్రకటించిన అభ్యర్థి మాత్రం కూల్‌గా సమయస్ఫూర్తితో, సంయమనం పాటించి 'పెద్దాయన భవిష్యత్తును నారాచంద్రబాబునాయుడు, నారా లోకేష్' చూసుకుంటారని వారు ఆయన్ను పిలిచి మాట్లాడుతారని వ్యాఖ్యానించారు.ఇక మరో అభ్యర్థి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినూతకోట ఇంటి వద్ద తెలుగుదేశం వారు దాడులు జరిపి అవమాన పరచారంటూ తిరుగుబాటు చేసారు. రహస్య సమావేశంలో పాల్గొన్నారు. ఒక దశలో ఆమె తాను ఇండిపెండెంట్ అభ్యర్థిగా రంగంలో దిగుతానని కూడా ప్రకటించారు. ఆమె పార్టీ అధినాయకుడు పవన్‌కళ్యాణ్‌ను కలిసారు. పార్టీ నాయకుడు తమ భవిష్యత్తు గురించి భరోసా ఇచ్చారని రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా కలసి పని చేసుకోక తప్పదని వినూత కోట ప్రకటించారు.ఇక బిజెపి నాయకుడు కోలా ఆనంద్ స్థానికంగా అందుబాటులో లేదు.కానీ ఆ పార్టీ మాత్రం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఒక్కసారి శ్రీకాళహస్తిలో కోలా ఆనంద్‌కు కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వానికి అవకాశం కల్పించాలంటూ కేంద్రం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారాల్లో దూసుకుపోతున్నారు. మా నాయకుడు బి.ఫారం తీసుకొని వస్తారని నమ్మబలుకుతున్నారు. అయితే అభ్యర్థి మాత్రం అన్ని సర్దుకుంటాయని జిల్లా పర్యటనకు వచ్చే తెలుగుదేశం పార్టీ నాయకుడు నారాచంద్రబాబునాయుడు పరిస్థితిని చక్కదిద్దుతారని ధీమాగా ఉన్నారు. అయితే ఆ పార్టీ గెలుపుకు సీనియర్ నేత ఎస్‌సివి నాయుడు సహకారం ఎంతో అవసరమని పరిశీలకులు చెబుతున్నారు. అయితే అధికార పార్టీకి చెందిన శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మాత్రం ఎవరెటుపోతే నాకేంటి నా గెలుపు నాకు ముఖ్యం అన్నట్లు ప్రణాళికలు రచించుకుంటూ ముందుకు పోతున్నారు.

## మసీదుల్లో ముస్లింల సామూహిక 'ఇఫ్తార్'

శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని 18 మసీదుల్లో శనివారం ముస్లింలు సామూహిక ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. రంజాన్‌మాసం లో ముస్లింలు ఆచరించే ఉపవాసదీక్షలకు ఈ సారి అనూహ్య స్పందన ఉంది. కమిటీల్లో ధార్మిక కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. అంతేకాక గురువుల ఆధ్యాత్మిక చింతన ఉపన్యాసాలతో చైతన్యం వచ్చిందని చెప్పవచ్చు, ఈ నేపథ్యంలో ఈఏడాది మసీదులు కిట కిట లాడు తున్నాయి. ఉపవాసదీక్షలు పాటించటంలోనూ, ఇఫ్తార్ విందులకు విశేష సంఖ్య లో ముస్లింలు హాజరౌతున్నారు.

**ప్రత్యేక ఏర్పాట్లు:** శ్రీకాళహస్తిలోని మసీదుల్లోఆధ్యాత్మిక చింతనతో పాటు భక్తి భావం ఉట్టిపడు తుంది. మసీదుల్లోఇఫ్తార్ విందుకు ఆయా మసీదుల కమిటిలో ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. పట్టణంలోని 18 మసీదుల్లో ఇఫ్తార్‌ఏర్పాట్లు చేసారు. ఉదయం నుంచి ఉపవాసదీక్షలను క్రమశిక్షణతోనూ, భక్తి భావంతో ఆచరించిసాయంత్రంఅల్లాహ్‌వద్ద మోకరిల్లి ప్రార్థిస్తే తప్పక ఆమోదిస్తారని నమ్మకంతో దీక్షలను ఆచరిస్తున్నారు.

**ఆష్ వితరణ:** వేకువ జాము 5గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు దీక్షలను పాటిస్తూ సాయంత్రం మసీదుల్లో ఇఫ్తార్‌కు సంబంధించి మసీదుల్లో 'ఆష్' అను పిండిద్రవపదార్థాన్ని అందిస్తున్నారు. పది,పదిహేను సంవత్సరాల క్రితం వరకు మసీదులకు ఇళ్ళ నుంచి ఆష్ (నూకలు,బిరియానితయారు చేయటానికి ఉపయో గించే మసాలాలు ఉపయోగించితయారుచేసే పదార్థం) తయారు చేసిపంపే వారు. మారుతున్న కాలాను గుణంగా మసీదు నిర్వాహకులే దానం ఇచ్చే వారి నుంచి సొమ్ములు తీసుకొని వారి పేరుతో ఏర్పాటు చేస్తున్నారు.

## మళ్ళీ వైకాపా గూటికి మైనారిటీలు

శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త



ఎన్నికల సమయంవచ్చిందంటే 'ఆయారాం గాయ రాం'ల సీజన్ చోటు చేసుకుం టుంది. ఈ నేపథ్యంల త్వరలో జరగనున్న ఎన్నికల సందర్భంగా శ్రీకాళహస్తి లో వలసల రాజకీయం రంజుగా మారింది. ఈ నేపథ్యంలో 18వ వార్డుకు చెందిన కొందరు ముస్లింలు ఇటీవల తెలుగుదేశంలో చేరినట్లు ప్రకటించారు. అయితే శని వారం వారు మళ్ళీ వైకాపాలోకి వచ్చినట్లు ఎంఎల్‌ఏ కార్యాలయం ఓ ప్రకటన జారీ చేసింది. తిరిగి పార్టీలోకి వచ్చిన వారు మాట్లాడుతూ తాము తెలుగుదేశం పార్టీలోకి వెళ్ళడం అనుకోకుండా జరిగిందని ఆ పార్టీలో ఒక్కరోజు కూడా ఇమ డలేక పోయామని వివరించారు. తిరిగి పార్టీలోకి వచ్చిన వారిలో పఠాన్ ఉమర్, సూరజ్, వసీం,ఫారూఖ్, నజీర్,అష్రఫ్, మహమ్మద్ గౌస్, రబ్బాని, సాజిద్ అహ్మద్, తదితరులున్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మెన్ షేక్ సిరాజ్‌బాషా, గోరా, 18వ వార్డుఇన్‌చార్జిపఠాన్‌ఫరీద్‌ఖాన్, ఫజల్, అమాన్, అస్లాం, అబ్బు, షబ్బీర్, జాఫర్, కాలేషా తదితరులున్నారు.

## 30న శ్రీకాళహస్తిలో చంద్రబాబు నాయుడు రోడ్‌షో

శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త

ఈ నెల 30న తెలుగుదేశం అధినేత నారాచంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచా రంలో భాగంగా శ్రీకాళహస్తిలో రోడ్‌షో నిర్వహించనున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ మేరకు రోడ్‌షో స్థలాన్ని ఎక్కడఏర్పాటు చేయాలనే అంశంపై చర్చలు జరుగు తున్నాయి. సాధారణంగా ఇప్పటి వరకు తెలుగుదేశం ఎన్నికల ప్రచార సభలు, రోడ్ షోలు బేరివారి మండపం వద్దనే ఏర్పాటు చేసే వారు. ఈ నెల 30న రోడ్ షో ఎక్కడ నిర్వహిస్తారన్నది ఇంకా తెలియలేదు.

## సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

తొట్టంబేడు, మార్చి 23 ప్రభాతవార్త



సంక్షేమ పాలన కావాలంటే తెలుగుదేశంపార్టీకి పట్టం కట్టాలని, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీని ఆదరించాలని బొజ్జలసుధీర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జిబొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి అన్నారు ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని విరూ పాక్షపురం, కొత్తకండ్రిగ పంచాయతీలో పర్యటి స్తూ కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల అధ్యక్షు డు గాలిమురళీ నాయుడు, పాలసరఫరా సంఘ మాజీ ఛైర్మన్ రావిళ్ళముని రాజ నాయుడులు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి వెంకటాచలం, మాజీ మార్కె ట్‌కమిటీ ఛైర్మన్ జయచంద్రనాయుడు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కావాలంటే వైకాపాను గెలిపించండి..!

-బియ్యపుశ్రీవాణి రెడ్డి

.తొట్టంబేడు, మార్చి 23 ప్రభాతవార్త



పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చే పరిపాలన అందించేందుకు, అందుబాటులో ఉన్నతన భర్త బియ్యపుమధుసూధన్‌రెడ్డిని, రాష్ట్రంలో వైఎస్ ఆర్‌సిపి పార్టీని మరోసారి గెలిపించేందుకు ప్రజలు సిద్దంగా ఉండాలని ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి సతీమణి బియ్యపుశ్రీవాణి తెలిపారు. ముందుగా బియ్యపుశ్రీవాణికి తొట్టంబేడు మండల అధ్యక్షుడు ఉన్నంవాసుదేవనాయుడు, ఎంపిపి ఉన్నంనిర్మల మరియు వైకాపా నాయకులు కార్యకర్తలు భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూడి ఇన్‌ఛార్జి నరసింహనాయుడు, మురళీ, నాగరాజు, విజయ్‌బాబు, వెంకటసుబ్బయ్య, పిఏసిఎస్ ఛైర్మన్ మణిబాబునా యుడు, శ్రీకాళహస్తి మండల ఇన్‌చార్జి వయ్యాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పించండి

తొట్టంబేడు, మార్చి 23 ప్రభాతవార్త



రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా తహశీల్దార్ శివరామసుబ్బయ్య పోలింగ్ కేంద్రాలను నిత్యం పరిశీలించి వాటిలో ఓటర్లు సౌకర్యాలపై ఆరాతీస్తున్నారు. ఈనేపథ్యంలో మండలంలోని261 విరూపాక్షపురం, 268 కొన్నిలి, 253 దయనేడు, 266 కొణతనేరి, 282 బసవన్నగుంట పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్లు సౌకర్యాలు లేకపోవడంతో గుర్తించిన ఆయన వెంటనే పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని ఎంఈవో భారతీని ఆదేశించారు. పరిశీలనలో కంప్యూటర్ ఆపరేటర్ సురేష్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యుడుకు శివయ్య ప్రసాదాలు

తొట్టంబేడు, మార్చి 23 ప్రభాతవార్త



బిజెపి ఎంపి రాజ్యసభ సభ్యుడు సి.ఎం. రమేష్‌ను శనివారం రేణిగుంట విమా నాశ్రయంలో తొట్టంబేడు తెలుగుదేశంపార్టీ యువ నాయకుడు సుధాకర్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలసి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలను అందించారు. ఈసందర్భంగా సిఎం రమేష్ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు నిరుపేదలకుచేరుతున్నాయా?లేదాఅనితెలుసుకున్నారు. కేంద్రపథకాలపై ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం చేయాలని కోరారు.

## సుధీర్‌రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరికలు

తొట్టంబేడు, మార్చి 23 ప్రభాతవార్త



మండలంలోని జ్ఞానమ్మకండ్రిగ గ్రామ వైసిపి నాయకులు, యువత శనివారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎంఎల్ఏ అభ్యర్థి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలోచేరారు. వీరికి తెలుగుదేశంపార్టీ కండువా కప్పి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో కుమార్‌రెడ్డి, వంశీరెడ్డి, ఆర్ముగం, మునికృష్ణారెడ్డి, మురళీరెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, మురళీ, మునిసేతన్, వాసురెడ్డి, తిరుపాల్‌రెడ్డి, లింగారెడ్డి, విష్ణురెడ్డి, సదాశివరెడ్డి మరియు 50మంది పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

## యువత భవితను చిదిమేస్తున్న జగన్ డ్రగ్స్ మాఫియా

శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త

యువత భవిష్యత్తును డ్రగ్స్‌మాఫియా చిదిమేస్తున్నాయని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో వైసిపినాయకులు డ్రగ్స్ మాఫియా విదేశాల నుంచి జరిపిస్తు న్నారని విమర్శించారు. కూనం పూర్ణచంద్రారావు వైసిపి సీనియర్ నాయకుడు కూనం కుటుంబం మొత్తం వైసిపి వ్యవస్థాపక సభ్యులే అని ధ్వజమెత్తారు. బ్రెజిల్ దేశాధ్యక్షునికి విజయసాయిరెడ్డి ఎందుకు ట్వీట్ చేశారు. సిబిఐ అధికారులు విధులకు ఏపి ఉన్నతాధికారులు ఎందుకు ఆటంకాలు కలిగిస్తున్నారని ప్రశించారు. టిడిపి హయాంలో ఏపి పెట్టుబడుల్లో నెం.1గా ఉంటే వైసిపి ప్రభుత్వ హయాంలో ఏపి డ్రగ్స్ సరఫరాలో ప్రథమస్థానంలో ఉందన్నారు.

## వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని డ్రగ్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చేసింది.

తిరుపతి కార్పొరేషన్, మార్చి 23, ప్రభాతవార్త

రాష్ట్రంలో వైసిపి ఐదేళ్ళ పరిపాలనలో రాష్ట్రాన్ని డ్రగ్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చేసిందని సప్తగిరి నగర్ క్లస్టర్ ఇంచార్జి ఉట్ల సురేంద్ర నాయుడు, రాష్ట్ర యువత కార్యదర్శి ఆర్‌పి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం విశాఖ సముద్ర తీరంలో పట్టుబడిన మత్తు పదార్థాలపై తిరుపతి నియోజకవర్గం ఇంచార్జి సుగుణమ్మ ఆదేశాల మేరకు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చిన రోజు నుండి ఈ రోజుటి వరకే యువతను మత్తుమందుకు బానిసలనుచేసి ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చేస్తున్నారన్నారు. పట్టణ కార్యదర్శి మహేష్ యాదవ్, 35,42,43,44 వార్డు అధ్యక్షులు ఎస్‌వీఎం శ్రీధర్, శంకర్, సుబ్బు యాదవ్, ధనుంజయ, జగ్గు, 26,27 వార్డు అధ్యక్షులు గంజి సుధాకర్ రెడ్డి, నాగ ప్రతాప్, వెంకటముని, నారాయణ, వెంకట్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రాజా, శీనులు పాల్గొన్నారు.

## సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ

విజయపురం, మార్చి 23 ప్రభాతవార్త:



మండలంలోని కేవీ పురంలో శనివారం బాబు సూపర్‌సిక్స్ కరపత్రాలను మండల టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. టీడీపీని ఆదరించి రాష్ట్ర భవిష్యత్ కోసం బాబును సీఎంచేయాలని ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి చుక్కా ధనంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూ షణమ్మ, నాయకులు వేణుగోపాల్‌నాయుడు, పురుషోత్తం, దశరథరాజు, సుధాకర్‌రాజు, మధునాయుడు, జీవరత్నం నాయుడు, ఢిల్లీనాయుడు, శివయ్యనాయుడు, పరందామనాయుడు, గుణశేఖర్‌రెడ్డి, కపిల్, బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం - సీడీపీవో

విజయపురం, మార్చి 23 ప్రభాతవార్త:

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని సీడీపీవో కృష్ణవేణి పేర్కొన్నారు. శనివారంవిజయపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గర్భిణీ తప్పని సరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, విజయ, రాధిక, విక్తరీ పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారు

రేణిగుంట, మార్చి 23 ప్రభాతవార్త:



మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని రాజ్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్టు ట్రస్టీ సుబ్బరత్నమ్మ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి ఇందిరానగర్ రాస్‌కార్యాలయంలో శనివారం మహిళా జ్యోతి మ్యూ చువల్ బెనిఫిట్ ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని రంగాల్లో మహిళలు అగ్రస్థానంలోఉన్నారన్నారు. కార్యక్రమంలో రాస్ ట్రస్టీలు రమేష్‌రెడ్డి, రామసుబ్బమ్మ, మస్తానమ్మ, టాటా ట్రస్టు హేమంత్‌కుమార్, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు పెరటి తోటలపై అవగాహన కలిగి ఉండాలి

రేణిగుంట, మార్చి 23 ప్రభాతవార్త:



ముఖ్యంగా రైతులు పెరటి తోటల పెంపకంపై అవగాహన పెంచుకోవాలని రాస్‌కృషి విజ్ఞాన కేంద్రం హెడ్, సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు అన్నారు. రేణిగుంట మండలం చైతన్యపురం కృషి విజ్ఞాన కేంద్రంలో 40 మంది షెడ్యూల్ కులాల రైతులకు పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. పెరటి తోటల పెంపకంపై అవగాహనకల్పిస్తూ పోషకాహార విత్తనాలు, మొబైల్ వర్మికం పోస్టు బెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాము కుమార్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## మా సేవలను వినియోగించుకోండి

రేణిగుంట, మార్చి 23 ప్రభాతవార్త:



సమాజానికి తాము చేస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రేణిగుంట మండల అధ్యక్షుడు పిల్లపాళెం రాము కోరారు. గాజులమండ్యం ఎస్ఐగా పదవి బాధ్యతలు చేపట్టిన సునీల్‌ను ఆలిండి యా అంబేడ్కర్ సంఘం నేతలు శనివారం కలిసి శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. సన్మానించిన వారిలో సంఘం నేతలు రవికుమార్, గోవర్ధన్, కల్యాణ్, మునిరాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని రక్షించుకుందాం : సిపాయి

రేణిగుంట, మార్చి 23 ప్రభాతవార్త:



వైసీపీని గెలిపించుకుని జగన్మోహన్‌రెడ్డిని మరలముఖ్యమంత్రి చేసుకుని రాష్ట్రాన్ని కాపాడుకోవాలని డా. సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. రేణిగుంట మండలం నల్లపాళెం గ్రామంలో ఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రహ్మణ్యం శనివారం వైసీపీ గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రజా నాయకుడిగా పేరు తెచ్చుకున్నబియ్యపుమధుసూదన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుని జగన్మోహ న్‌రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రి పీఠాన్ని ఎక్కించాలని సిపాయి పిలుపునిచ్చారు.

## గోవింద నామ సంకీర్తనలతో మారుమోగిన తిరుపతి

తిరుపతి హెల్త్, మార్చి 23, ప్రభాతవార్త



గోవిందనామ సంకీర్తనలతో తిరుపతి నగరం మారుమోగింది. ప్రతి శనివారం స్థానిక రాయలసీమ రంగస్థలి కళాకారులు స్థానిక భక్తులు గోవింద నామ సంకీర్తన చేస్తూ మాడ వీధుల్లో సంచరిస్తూ భక్తి భావాన్ని పెంచారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో అడుగడుగునా భక్తిభావం కనబడుతుంది. నిత్య గోవింద నామ స్మరణ వినిపిస్తుంది. స్థానిక రాయలసీమ రంగస్థలి కళాకారులు ప్రతి శనివారం నగరసంకీర్తన చేయాలని సంకల్పించారు. ఈ క్రమంలో నేటి ఉదయం వేకువజామున స్నానమాచరించి గోవిందనామాలు ధరించి గోవింద నామ సంకీర్తనలు చేస్తూగోవిందరాజ స్వామి ఆలయ మాడవీధుల్లో మంగళవాయిద్యాలు నడుమ పర్యటించారు. ఈ సందర్భంగా కళాకారులు ఎం. సుశీల, వాసు మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన తిరుపతిలో భగవంతుని సంకీర్తన చేయడం లేదా భజన చేయడం లాంటి పుణ్యక్షేత్రంలో పుట్టడం ధన్యమన్నారు. భక్తులకు అన్న ప్రసాదం విక్రమ్ స్వామి, మునినాథరెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి, రాయలసీమ రంగస్థలం కళాకారులుగుండాలగోపినాథ్, జేజిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, కసావునూరు వాసురెడ్డి, కుమార్, తిరుపాలాచారి, సుశీలమునినాథరెడ్డి, నరసింహారెడ్డి, శాంబోల హరినాథ్, చెంగారెడ్డి, పార్వతి, జయమ్మ, ధనంజయ రెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, ప్రభాకర్ నాయుడు, విజయసింహారెడ్డి, కళాకారులు, భక్తులు పాల్గొన్నారు.

## డివైడర్‌ని ఢీకొన్న కారు.

### తృటిలో తప్పిన పెను ప్రమాదం

ఏర్పేడు, మార్చి23, ప్రభాతవార్త;



శ్రీకాళహస్తి- రేణిగుంట మార్గంలో ఓ కారు అతివేగంగా వచ్చి డీవైడర్ బ్లాక్‌ని ఢీకొనిన కారు తృటిలో తప్పించుకున్న ఘటన ఏర్పేడు సమీపంలోని జడ్పీ హైస్కూల్ వద్ద శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన బిష్ణుకుమార్ తన కుటుంబంతో కలసి బెలినో కారు నెంబరు 24 బిహెచ్‌ట 132డి తనస్వగ్రామం నుంచి బెంగళూరు పట్టణానికి వెళుతుండగా శనివారం మధ్యాహ్నం ఏర్పేడు సమీపంలోని జడ్పీ హైస్కూల్ వద్ద ఏర్పేడు పోలీసులు వాహన చోదకుల రక్షణ కోసం ఏర్పాటు చేసిని డివైడర్ బ్లాక్‌ను ఢీకొని కారు రైట్ ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. ఎవ్వరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈవిషయమైపోలీసులను వివరణ కోరగా మాకు ఎలాంటి పిర్యాదులు అంద లేదని, డివైడర్లను రాత్రి సమయాల్లో వాహనాల రాపిడికి కొంత మేర డివైడర్ బ్లాక్‌లు జరిగి ఉండవచ్చని, వాహన చోదకులు జాగ్రత్తలు పాటించాల్సిన భాధ్యత కూడా వారిపై ఉందన్నారు. ఎస్సై జగన్మోహన్ పేర్కొన్నారు.

## త్రిదళ బిల్వ వృక్షాల వితరణ

శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం నిర్వహిస్తున్న చెట్ల పెంపకం కేంద్రానికి మాచర్లకు చెందిన భక్తులు త్రిదళ బిల్వవృ క్షాలను వితరణ చేశారు. శివయ్యకు బిల్వ దళాలంటే ఎంతో ప్రీతిపాత్రం. శివయ్యను బిల్వ దళాలతో పూజించే అనవాయితి ఉంది. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరుని గిరి ప్రదక్షిణం చుట్టూ సుమారు 23 కిలో మీటర్లు బిల్వ వృక్షాలను పెంచాలని పాలకులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో శనివారం పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా మాచర్లకు చెందిన కేశవరెడ్డి 750 త్రిదళ బిల్వ చెట్లు దేవస్థానికి విరాళం అందించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి ద్వారా కేశవరెడ్డి బిల్వ వృక్షాలను అందించారు.

## నిత్యాన్న ప్రసాదానికి రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచి విరివిగా విరాళాలందుతు న్నాయి. శనివారం కరీంనగర్ జిల్లాకు చెందిన ఏనుగుల కోమరయ్య దంపతులు స్వామిఅమ్మవార్ల నుదర్శించుకుని అకౌంటెంట్ యుగంధర్ వద్ద రూ.లక్ష చెక్కును అందించారు. వారికి ఆలయం తరఫున ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసారు. పిఆర్‌ఓ కార్యాలయానికి చెందిన గోపాల్ వారికి ప్రత్యేకంగా స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేయించారు. దక్షిణ మూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

# తిరుపతి డివిజన్

## టిడిపి వర్క్‌షాప్‌లో ఆదిమూలం

నారాయణవనం, మార్చి 23 ప్రభాతవార్త :



శనివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర తెలుగుదేశం వర్క్‌షాప్‌లో సత్యవేడు టిడిపి అభ్యర్థి కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో జాతీ తెలుగుదేశం అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చం నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్‌లో ప్రధానంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికల ప్రచారం, ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు ఎలా తీసుకెళ్లాలన్న అంశాలపైవివరించారు. అలాగేటిడిపిమేనిఫెస్టోనిప్రజల్లోకిఎలా తీసుకెళ్లాలన్న వాటిపై దిశ నిర్దేశం చేశారు.

## వైకాపాక్కు ప్రజలే బుద్ది చెప్పాలి..!

నారాయణవనం, మార్చి 23 ప్రభాతవార్త :



రాష్ట్రాన్ని డ్రగ్స్‌కు కేంద్రంగా మార్చిన వైకాపా ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమయ్యిందని తెలుగుదేశం పార్టీ మండల టిడిపి అధ్యక్షులు ఎన్.భాస్కరన్, మాజీ ఎంపిపి పి.గోవిందస్వామిలు మండి పడ్డారు. శని వారం స్థానిక బోస్ సేవా సంస్థ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను కేపిటల్ చేస్తానని చెప్పి, నేడు డ్రగ్స్‌కు కేంద్రంగా మార్చేశారని మండిపడ్డారు. ఏపిని డ్రగ్స్ కేంద్రంగా తయారు చేసి దేశంలో మన రాష్ట్ర పరువును తీశారని మండిడ్డారు. సిబిఐ అధికారులు పూర్తి స్థాయిలోవిచారణజరిపిచర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కెఎస్‌రవి, అచ్చుకట్ల హరి, గాండ్ల గోవిందశెట్టి, దొరవేలురెడ్డి, కె బాలయ్య. సి సోము, నరేష్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్‌కు నివాళులు

పుత్తూరురూరల్, మార్చి 23 ప్రభాతవార్త:

భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పుత్తూరులో సీపీఎం నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశం కోసంప్రజలకోసంబ్రిటీష్‌పాలనవ్యతిరేకించిప్రాణత్యాగం చేసి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గొప్పమహనీయుడని ఆయన అడుగుజాడల్లో అందరం నడుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, విజయ్, సుబ్రహ్మణ్యం, పురుషోత్తం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పుత్తూరు మున్సిపాలిటీలో వైసిపి ఎన్నికల ప్రచారం

పుత్తూరురూరల్, మార్చి 23 ప్రభాతవార్త:



పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు భవానీనగర్‌లో శనివారం వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి రోజా సోదరులురామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి గత ఐదేళ్ళలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్‌లు జయప్రకాష్, డి.శంకర్, నాయకులు మోహన్, మనోహర్‌రెడ్డి, మైనారిటీ డైరెక్టర్ మహిన్, కౌన్సిలర్ ఏకాంబరం, పవన్, గోపి, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చిరంజీవి, మురళి, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శని త్రయోదశి వేడుకలు

పుత్తూరురూరల్, మార్చి 23 ప్రభాతవార్త:



మండల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో శివాలయంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, తైలాభిషేకాలు పంచామృతాభిషేకా లు చేశారు. పట్టణంలోని శ్రీకామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో ఆలయచైర్మన్ కొడగంటి రమేష్‌బాబు ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శని భగవానుడికి అభిషేకాలు, అలంకరణలు చేశారు.

## మహిళలకు ఆసరా నిధులెక్కడా...? - సీపీఎం

కేవీబీ పురం, మార్చి 23 ప్రభాతవార్త:

డ్వాక్రా మహిళలకు రుణమాఫీలో భాగంగా చివరి విడత నిధులను ఇంత వరకు మహిళలఖాతాలో జమకాలేదని సీపీఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి జనార్ధన్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆర్భాటంగా ఎన్నికల కోడ్ వస్తుందని ముందుగానే జనవరి 23న బటన్ నొక్కి ఆసరా నిధులను విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే బటన్ నొక్కి 60 రోజులు అవుతున్నా కూడా ఇంత వరకు మహిళల ఖాతాలో నిధులు జమ చేయకపోవడం దారుణమన్నారు.

## నాని ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం

చంద్రగిరి, మార్చి 23 ప్రభాతవార్త:



చంద్రగిరి టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని ప్రయాణిస్తున్న కారును గుంటూరు సమీపంలో టిప్పర్ ఢీ కొట్టింది. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు నిర్వహించతలపెట్టిన సార్వత్రిక ఎన్నికల సన్నాహక సమావేశానికి శనివారం విజయవాడ పులివర్తి నాని విజయవాడ బయలుదేరి వెళ్ళారు. గుంటూరు సమీపంలో వెళుతుండగా వెనుక నుండి టిప్పర్ ఢీ కొట్టిన ప్రమాదంలో కారు వెనుక భాగం దెబ్బతిన్నది. ఈ నేపథ్యంలో అభిమానుల ఆందోళనను నివృత్తి చేస్తూ తాను ఆరోగ్యంతో వున్నానీ, అధైర్యపడవద్దన్నారు. ప్రమాద సమయంలో కారులో వున్న వారు సురక్షితంగా బయటపడంలో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం అక్కడి నుండి మరో కారులో విజయవాడ బయలుదేరి వెళ్ళారు.

## ఎన్నికలలో భాగమే మోడీ దాడులు

### కాంగ్రెస్ నేత మాంగాటి గోపాల్ రెడ్డి ఆగ్రహం



**తిరుపతి హెల్త్, మార్చి 23, ప్రభాతవార్త** రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపక్షాలను బలహీనం చేయడానికి తెలంగాణలో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కవితను అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ స్థాపకులు, ఢిల్లీ సిఎం అరవింద్ క్రేజీవాల్ తదితర జాతీయ ప్రతిపక్ష నేతల అక్రమ కేసులను వెలికి తీసి అరెస్టులకు పాల్పడడం బిజేపికి వెన్నతో పెట్టిన విద్య అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రైతు నాయకుడు మాంగాటి గోపాల్ రెడ్డి ఆరోపణలు చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శనివారం మీడియా ముందు కాంగ్రెస్ నాయకులతో కలిసి మాంగాటి మాట్లాడుతూ ప్రధాని మోడీ ఈ సారి ఎన్నికల్లో నాలుగు వందల సీట్లు సాధిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని, భాజాపా 200 స్థానాలు కూడా గెలవదని, బిజెపికి దమ్ము, ధైర్యం ఉంటే నీతి నిజాయితీతో ఎన్నికల్లో గెలవాలి కానీ ఇలాంటి ఇలాంటివాటితో కాదని ఆయన హితవు పలికారు.

## వైభవంగా రథోత్సవం

నగరి, మార్చి 23 ప్రభాతవార్త:



స్వర్ణకాంతులు చిందే రథంపై కామాక్షి సమేతంగా కరకంఠేశ్వరుడు దేదీప్యమా నంగా మాడవీధుల్లో విహరించారు. పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగునోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజు శనివారం రథోత్సవ వేడుకలు నిర్వహించారు. హరహర నామ ఘోషాల మధ్య ఆలయ నిర్వాహకులు రథాన్ని ముందుకు లాగి రథోత్సవ వేడుకలను ప్రారంభించగా అధికసంఖ్యలో భక్తులు రథాన్ని లాగుతూ కరకంఠేశ్వరునికి కర్పూర హారతులు ఇచ్చిదర్శించుకున్నారు. కార్యక్రమంలో రథం విరాళదాతలు కోనేరు అమృతమ్మ, సుబ్రహ్మణ్యం మొదలియార్, ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి మొదలియార్, సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## వైసీపీలో టీడీపీ నాయకుల చేరిక

వడమాలపేట, మార్చి 23 ప్రభాతవార్త:



సిద్ధం అన్న నినాదంతో వైసీపీ పార్టీ ఎన్నికల బరిలో ముందడుగు వేస్తుంటే మీ వెంట రావడానికి మేము సిద్ధమే అంటూ టీడీపీ నాయకులు సైతం వైసీపీ పార్టీతో అడుగులుకలుపుతున్నారు. శనివారం వడమాలపేట మండలం కాయం పేటకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు కాయం బాబురెడ్డి మంత్రి రోజా సమక్షంలో వైసీపి తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి పార్టీ కండువా వేసి ఆయనను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కోవిడ్ విపత్కరపరిస్థితుల్లోను అందరికి అండగా నిలిచి సహకారం అందించాలన్నారు. ఇవంతా మనసును కదిలించడంతో మంచి చేసే వారికి అండగా ఉండాలని పార్టీలో చేరుతున్నానన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ జగనన్న అనుసరిస్తూ తాను ముందుకు

